# రైతు మెడకు ఉరితాడు

## కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో దారుణ పరిస్థితులు

- కరువుతో అల్లాడుతున్న కర్షకులు
- రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం
- కేంద్ర ప్రభుత్వ అధికారుల ఎదుటే ఆత్మహత్యకు యత్నించిన అన్నదాత



బెంగళూరు, అక్టోబర్ 6: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో రైతన్నలు ఉరికొయ్యకు వేలాడుతున్నారు. ఆ రాష్ట్ర రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత బీజేపీ ప్రభుత్వం కర్షకుల సంక్షేమాన్ని గాలికొదిలేయడంతో.. కాంగ్రెస్‌కు పట్టం కట్టినా రైతుల బతుకులు మారలేదు. రాష్ట్రంలో రైతుల బలవన్మరణాలు ఇప్పటికీ కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. వర్షాభావ పరిస్థితులు, పంట నష్టం కారణంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిన వందల మంది రైతన్నలు తనువు చాలిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 251 మంది అన్నదాతలు అసువులుబాశారు.

**అప్పుల ఊబిలో రైతులు...**

వర్షాభావ పరిస్థితుల వల్ల కర్ణాటకలోని వివిధ జిల్లాల్లో కరవు ఏర్పడింది. పంట సాగు కోసం ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడులు తిరిగొచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గత ఏడాది భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అప్పులు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు వారి పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. అప్పటి బీజేపీ సర్కారు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కర్షకుల కష్టాలను పట్టించుకోకపోవడంతో కాడి వదిలేస్తున్న కర్షకులు ఉరికొయ్యలకు వేలాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్ట పరిహారం ఇచ్చి, రైతులను ఆదుకోవడంలో విఫలమవడంతో రైతుల బలవన్మరణాలు పెరుగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.

**195 తాలూకాల్లో కరువు...**

అప్పుల కట్టలేక తనువు చాలించిన రైతన్నలకు మరణం తర్వాత కూడా న్యాయం జరగడం లేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 251 మంది అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడగా.. వారిలో 174 బాధిత కుటుంబాలే పరిహారానికి అర్హులుగా ఇటీవల కర్ణాటక సర్కార్ పేర్కొనడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మరోవైపు 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 1,219 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నట్టు గణాంకాలు చెబుతుండగా వారిలో చాలా మంది కుటుంబాలకు పరిహారం అందలేదని తెలుస్తున్నది. కాగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కరువు ప్రభావానికి గురైన తాలూకాల వివరాలను వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 195 తాలూకాలు కరువుతో అల్లాడుతున్నాయని అందులో పేర్కొంది. మరో 32 తాలూకాల్లోనూ అవే పరిస్థితులు ఉన్నాయని తెలిపింది. అయితే, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల తీరుపై విమర్శలు వస్తున్నాయి.

**రైతుల ఆత్మహత్యలు ఇలా (డీసీఆర్‌బీ డాటా)...**

| జిల్లా | చనిపోయిన రైతులు |
|---|---|
| కలబురిగి | 29 |
| బీదర్ | 35 |
| విజయపుర | 21 |
| యాద్గిర్ | 21 |

| | |
|---|---|
| రాష్ట్రవ్యాప్తంగా 251 మంది (ఏప్రిల్ నుంచి) | 2022 నుంచి ఇప్పటి వరకు 1219 మంది |
| కరువు తాండవించిన తాలూకాలు 195 | కరువు పరిస్థితులు ఉన్నవి 32 (అదనం) |

పంట నష్టం - 4.2 మిలియన్ హెక్టార్లు

కరవు ప్రభావానికి గురైన జిల్లాలు... బెళగావి, విజయపుర, బాగల్‌కోట్, ధార్వాడ్, గడగ్, కొప్పల్, బళ్లారి, విజయనగర్, చిక్‌బళ్లాపూర్, తుమకూరు, చిత్రదుర్గ, దెవనగెరె, బెంగళూరు రూరల్.

### పరామర్శలేనా.. పరిహారం ఇవ్వరా?

పంట నష్టపోయి సర్వస్వం కోల్పోయిన ఓ రైతు దిక్కుతోచని స్థితిలో బలవన్మరణానికి యత్నించారు. పంట నష్టం అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందాల సాక్షిగా ఆయన ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం సృష్టించింది. బెలగావి జిల్లాలో ఈ ఘటన శుక్రవారం జరిగింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాభావం కారణంగా కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బృందం పంట నష్టాన్ని అంచనా వేసేందుకు పొలానికి రాగా.. జిల్లాకు చెందిన అప్పాసాహెబ్ లక్కుండి వారి ఎదుటే పురుగుల మందు తాగేందుకు విఫలయత్నం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు ఆయన్ను నివారించి పురుగుల మందు డబ్బా లాక్కున్నారు. 40 ఎకరాల్లో సాగు చేశానని, పంట మొత్తం నాశనం అయిపోయిందని బాధితుడు రోదించారు. అధికారులు, నాయకులు పరామర్శిస్తున్నారే తప్ప.. నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



### ప్రతిపక్షాలను బలహీనపర్చేందుకు తప్పుడు కేసులు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పార్టీలను బలహీనపర్చడానికే కేంద్రంలోని మోదీ సర్కారు తప్పుడు కేసులను బనాయిస్తున్నదని ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'బీజేపీ ప్రభుత్వం ఎన్ని అబద్ధాలాడుతుందంటే.. ఢిల్లీలో బస్సు కుంభకోణం జరిగిందని, తరగతి గదుల కుంభకోణమని, విద్యుత్ కుంభకోణమని, రోడ్డు నిర్మాణాల్లో అవకతవకలని, నీటి సరఫరాలో అవినీతని.. ఇలా నోటి కొచ్చినన్ని అబద్ధాలు చెప్పింది. అవన్నీ అబద్ధాలు కాబట్టే ఒక్క కుంభకోణం నిరూపితం కాలేదు. ఇప్పుడు మద్యం పాలసీ కేసు కూడా అలాంటిదే. దీన్ని కృత్రిమంగా సృష్టించారు. అందుకే ఈడీకి ఆధారాలు లభించడం లేదు. కాబట్టి కోర్టులో నీళ్లు నములుతున్నది' అని పేర్కొన్నారు.

### కేజ్రీవాల్ అభ్యర్థనను మళ్లీ తిరస్కరించిన గుజరాత్ హైకోర్టు

అహ్మదాబాద్, అక్టోబర్ 6 : గుజరాత్ విశ్వవిద్యాలయం దాఖలు చేసిన పరువు నష్టం కేసులో తమ వాదనలను అత్యవసరంగా వినాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ నేత సంజయ్ సింగ్ చేసిన విజ్ఞప్తిని గుజరాత్ హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్హతల విషయంలో వీరిద్దరూ చేసిన వ్యాఖ్యలపై ఈ కేసు దాఖలైంది. వీరికి క్రింది కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేయాలని వీరు కోరుతున్నారు.



### ఇండియా కూటమితో సవాలే

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ప్రతిపక్ష ఇండియా కూటమితో అసలైన సవాల్ ఎదురుకానున్నదని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అన్నారు. అయితే బీజేపీ ఏ ఎన్నికను తేలిగ్గా తీసుకోదని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. సొంత రాష్ట్రం ఒడిశా నుంచి పోటీ చేయాలనుందని ఆయన తన మనసులో మాటను బయటపెట్టారు. న్యూఢిల్లీలో శుక్రవారం కేంద్ర మంత్రి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశమివ్వాలని పార్టీని అభ్యర్థించినట్టు తెలిపారు.

### 42 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీల మద్దతు

**తమకే మెజారిటీ ఉందన్న అజిత్ వర్గం**

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని ఎన్సీపీలో పార్టీ పేరు, గుర్తుపై తలెత్తిన పంచాయితీ ఎన్నికల సంఘం ముందు విచారణకు వచ్చింది. శుక్రవారం శరద్ పవార్, అజిత్ పవార్‌లు ఈసీని కలిశారు. మహారాష్ట్రలో మొత్తం 53 మందిలో 42 మంది ఎమ్మెల్యేలు, 9 మందిలో ఆరుగురు ఎంఎల్‌సీలు, నాగాలాండ్‌లోని మొత్తం ఏడుగురు ఎంఎల్‌ఏలు, లోక్‌సభ, రాజ్యసభల్లోని ఒక్కో సభ్యుడి మద్దతు తనకే ఉందని అజిత్ పేర్కొంటున్నారు. దానిని నిర్ధారించే పత్రాలను సమర్పించారు. అయితే అసలైన పార్టీ ఎవరిదో అందరికీ తెలుసని శరద్ పవార్ స్పష్టం చేశారు.

## రెండు వేలు మాకు రాలేదు

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు భంగపాటు
- రెండు వేల పథకం లబ్ధి చేకూరిందా అని మహిళలను అడిగిన ముఖ్యమంత్రి
- మాకు రాలేదంటే.. మాకు రాలేదన్న మహిళలు



బెంగళూరు, అక్టోబర్ 6: కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు భంగపాటు ఎదురైంది. మహిళలను అడిగి మరీ ఆయన నిలదీతకు గురయ్యారు. ఐదు గ్యారంటీలు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ఆపసోపాలు పడుతున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో పథకాల అమలులో ఆ రాష్ట్ర సర్కార్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రజలు గ్యారంటీల గురించి నిలదీస్తున్నారు. తాజాగా ఏకంగా సీఎం సిద్ధరామయ్యనే మహిళలు పథక లబ్ధి తమకు అందలేని కంగుతినిపించారు. రాష్ట్రంలోని ఓ జిల్లాలో నిర్వహించిన సభలో గృహలక్ష్మి పథకం లబ్ధి చేకూరుతున్నదా? అని సీఎం అడిగారు. అయితే ఆయన అడిగినప్పటికీ సభలో ఉన్న మహిళలెవరూ స్పందించలేదు. దీంతో సిద్ధరామయ్యే మళ్లీ కలగజేసుకొని మరోసారి అదే ప్రశ్నను అడిగారు. దీంతో మహిళలంతా ఒక్కసారిగా మాకు రాలేదంటే.. మాకు రాలేదని ముక్తకంఠంతో అరిచారు. దీంతో సీఎం సిద్ధరామయ్య కంగుతిన్నారు. అంతలోనే తేరుకొని విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఇప్పటికే చాలా మందికి పథకం అందుతున్నదని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు లింక్ కాకపోవడం తదితర కారణాల వల్ల కొంతమందికి అందలేదని, వారికి కూడా త్వరలోనే అందిస్తామని చెప్పి చల్లగా జారుకున్నారు.

### ఆయిల్ చోరీకి ఏకంగా సొరంగమే తవ్వాడు!

న్యూఢిల్లీ: ఏకంగా ఒక సొరంగాన్నే తవ్వి కంపెనీ పైప్‌లైన్ నుంచి ఆయిల్‌ను దర్జాగా చోరీ చేస్తున్న ఒక వ్యక్తిని ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. పోచన్‌పూర్‌కు చెందిన రాకేష్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) పైపుల నుంచి ఆయిల్‌ను అపహరించడానికి పెద్ద పథకమే వేశాడు. పైపునకు దగ్గరగా ఉన్న తన స్థలం నుంచి సొరంగం తవ్వాడు. పైపులైన్‌లోని ఆయిల్‌ను తోడేయడం ప్రారంభించాడు. అనుమానం వచ్చిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి బండారాన్ని బట్టబయలు అయింది.

### భారత్‌లోని దౌత్యవేత్తలను తరలించిన కెనడా

టొరంటో: భారత్ అల్టిమేటం నేపథ్యంలో తమ దౌత్యవేత్తలను కెనడా ఇతర దేశాలకు తరలించింది. ఈ నెల 10 లోగా 41 మంది దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవాలని ఇటీవల భారత ప్రభుత్వం ఆ దేశానికి హెచ్చరికలు చేసింది. ఈ నేపథ్యంలో భారత్‌లోని తమ దౌత్యవేత్తలను సింగపూర్, కౌలాలంపూర్‌కు కెనడా తరలించినట్టు ఆ దేశ మీడియా తెలిపింది. అయితే భారత్‌లోని తమ దౌత్యవేత్తలకు బెదిరింపులు వస్తుండటంతోనే వారిని ఇతర దేశాల్లో సర్దుబాటు చేస్తున్నామని కెనడా ప్రకటించింది.

### ప్రభుత్వ విధాన నిర్ణయాలను అడ్డుకోలేం

**బీహార్ కులగణనపై సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: బీహార్ ప్రభుత్వం కుల గణన సమాచారాన్ని వెల్లడించకుండా అడ్డుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే కోర్టు పరిశీలనలో ఉండగా సర్వేకు సంబంధించిన వివరాలను ఎందుకు వెల్లడించారని బీహార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మిగిలిన డాటాను ప్రజా బాహుళ్యానికి వెల్లడించకుండా ఆదేశాలివ్వడానికి నిరాకరిస్తూ.. ఒక వేళ డాటాకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే దానిని పరిశీలిస్తామని పేర్కొంది. బీహార్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనను కొనసాగించవచ్చంటూ పాట్నా హైకోర్టు ఆగస్టు 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై కోర్టు విచారణ చేపట్టింది. న్యాయస్థానంలో విచారణలో ఉండగా బీహార్ ప్రభుత్వం సర్వే వివరాలు విడుదల చేయడాన్ని ప్రశ్నించిన పిటిషనర్లు, తదుపరి వివరాలు ప్రకటించకుండా అడ్డుకోవాలని సుప్రీంని కోరారు. దీనికి నిరాకరించిన సుప్రీం.. ప్రభుత్వ చర్యను తాము నిరోధించమని స్పష్టం చేసింది. అయితే ఈ ప్రక్రియ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలను పరిశీలిస్తామని పేర్కొంది.

### ముందస్తు జననాలు భారత్‌లోనే ఎక్కువ

**లాన్సెట్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడి**

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ప్రపంచవ్యాప్తంగా 2020లో అత్యధిక ముందస్తు జననాలు (3.02 మిలియన్లు) భారత్‌లోనే సంభవించినట్టు లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. మొత్తం ముందస్తు జననాల్లో 20 శాతం భారత్‌లోనే జరిగాయని పేర్కొంది. ఆ తర్వాతి స్థానాల్లో పాకిస్థాన్, నైజీరియా, చైనా, ఇథియోపియా, బంగ్లాదేశ్, కాంగో, అమెరికా నిలిచాయి. ఈ 8 దేశాల్లోనే మొత్తం 50 శాతం జననాలు జరిగాయి. పేద, మధ్య ఆదాయ దేశాలతో పాటు గ్రీస్, అమెరికా వంటి సంపన్న దేశాల్లోనూ ముందస్తు జననాల రేటు 10 శాతం కంటే ఎక్కువగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా 13.4 మిలియన్ల శిశువులు నెలలు నిండకుండానే పుట్టారని అధ్యయనం అంచనా వేసింది. 2010-2020 మధ్య ఈ తరహా జననాల ప్రపంచ వార్షిక రేటు కేవలం 0.14 శాతం మాత్రమే తగ్గింది. ఈ నేపథ్యంలో ఈ విధంగా జన్మించిన చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అధ్యయనం పిలుపునిచ్చింది. అలాగే గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, పోషకాహారం పైనా దృష్టి సారించాలని సూచించింది. 'నెలలు నిండకుండానే పుట్టిన పిల్లలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం' అని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ ఆఫ్ మెటర్నల్ అన్షు బెనర్జీ తెలిపారు.

## 2రోజుల్లో ఎన్నికల షెడ్యూల్!

మొదటిపేజీ తరువాయి...

జాతీయ మీడియా వెల్లడించింది. రాజస్థాన్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మిజోరంలో పోలింగ్ ఒకే దశలో నిర్వహించాలని ఈసీ ప్రాథమికంగా నిర్ణయించినట్టు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లో రెండు దశల్లో నిర్వహించనున్నట్టు తెలిసింది. 2018లో కూడా ఇలాగే పోలింగ్ నిర్వహించారు.

**డిసెంబర్ 10-15 మధ్య కౌంటింగ్**

మిజోరం అసెంబ్లీకి డిసెంబర్ 17తో గడువు ముగుస్తుంది. తెలంగాణ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీలకు వచ్చే ఏడాది జనవరిలో వివిధ తేదీల్లో గడువులు ముగుస్తాయి. మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉండగా, తెలంగాణలో బీఆర్ఎస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో పోలింగ్ వేరువేరు తేదీల్లో నిర్వహిస్తారని, కౌంటింగ్ మాత్రం ఒకేరోజు ఉంటుందని ఈసీ వర్గాల సమాచారం. ఈసీ సభ్యులు ఈ ఐదు రాష్ట్రాల్లో ఇప్పటికే పర్యటించి ఎన్నికల సన్నద్ధతను పరిశీలించారు.

### ఎన్నికల వేళ ఉచితాల పంపిణీ

**మధ్యప్రదేశ్, రాజస్థాన్ సర్కార్లకు సుప్రీం కోర్టు నోటీసులు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ఎన్నికల వేళ మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉచితాలు పంపిణీ చేస్తున్నట్టు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై నాలుగు వారాల్లో స్పందన తెలపాలని మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ఆర్‌బీఐలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఓటర్లకు గాలం వేసేందుకు ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పన్ను చెల్లింపుదారుల డబ్బును దుర్వినియోగం చేస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు.

### సిరియా మిలిటరీ కాలేజ్‌పై డ్రోన్ దాడి.. 100 మంది మృతి

డమాస్కస్ : సిరియాలోని హోమ్స్ ప్రావిన్స్‌లో ఉన్న మిలిటరీ కాలేజ్‌పై శుక్రవారం ఉదయం డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోగా, 240 మంది గాయపడ్డారు. మృతుల్లో ఆరుగురు బాలలు ఉన్నారు. గ్రాడ్యుయేషన్ కార్యక్రమం జరుగుతుండగా ఈ దాడి జరిగింది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ గుటెరస్ ఈ దారుణంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

### పిల్లలపై లైంగిక వేధింపుల కంటెంట్ తొలగించండి: కేంద్రం

న్యూఢిల్లీ: పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని సామాజిక మాధ్యమ సంస్థలు ఎక్స్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000కు అనుగుణంగా నడచుకోవాలని స్పష్టంచేసింది. చట్టాన్ని ఉల్లంఘించిన వేదికలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

### న్యూయార్క్‌లో 'వలస' సంక్షోభం

న్యూయార్క్, అక్టోబర్ 6: అమెరికా వెళ్లాలని ప్రపంచంలోని చాలా మంది కలలు కంటుంటారు. ఈ కలే ఆ దేశానికి చిక్కులు తెచ్చిపెడుతున్నది. అక్కడ లభించే సౌకర్యవంతమైన జీవితం, అపార ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రతి ఏడాది లక్షలాది మంది అధికారికంగా ఆ దేశానికి క్యూ కడుతున్నారు. అయితే వీరికి తోడు అక్రమ వలసదారులు కూడా పెద్ద ఎత్తున చొరబడుతుండటం ఆ దేశ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యంగా న్యూయార్క్ నగరంలో అక్రమ వలసదారులకు ఆవాసం కల్పించడం అధికారులకు సమస్యగా మారింది. గత ఏడాది న్యూయార్క్‌లో 1,18,000 మంది అక్రమ వలసదారులు రాగా, వీరిలో 60 వేల మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన షెల్టర్లలో ఉంటున్నారు. అయితే వీరి ఇతర అవసరాలను తీర్చడం అధికారులకు ఇబ్బందిగా మారింది. తమ మానవతా వైఖరి న్యూయార్క్ నగరాన్ని నాశనం చేస్తున్నదని మేయర్ ఎరిక్ ఆడమ్స్ వ్యాఖ్యానించారు.

**నిండిపోతున్న షెల్టర్లు**

సాధారణంగా దక్షిణ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా దేశాలకు చెందిన వలసదారులు ఇక్కడకు అధికంగా వస్తున్నారు. వీరికి స్కూల్ జిమ్‌లు, బడ్జెట్ హోటల్స్, పార్కింగ్ ప్రదేశాలు తదితరమైనవి ఆవాసాలుగా కేటాయిస్తున్నారు. అయితే ఇప్పుడు అవి కూడా నిండిపోవడంతో నగరానికి పెద్ద సమస్యగా మారింది.



## డబుల్ ఇంజిన్ మహారాష్ట్రలో బడుల మూసివేత

- షిండే ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెల 15 నుంచే అమలు
- గిరిజన, గ్రామీణ ప్రాంత విద్యార్థులపై తీవ్ర ప్రభావం

ముంబై, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో సర్కారీ విద్య కొత్త పుంతలు తొక్కుతుంటే.. డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలోని మహారాష్ట్రలో మాత్రం తక్కువ విద్యార్థులున్న ప్రభుత్వ బడుల మూసివేతకు రంగం సిద్ధమైంది! 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న దాదాపు 15 వేల జిల్లా పరిషత్ పాఠశాలలను మూసివేసి, వాటి స్థానంలో గ్రూపు పాఠశాలలు ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ విధంగా చేస్తే గ్రామీణ విద్యార్థులు చదువు కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తుంది. పేద విద్యార్థులు చదువుకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలల వివరాలను ఈ నెల 15లోపు తమకు పంపాలని రాష్ట్ర విద్యా శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలలు 14,783 ఉన్నాయి. వీటిలో 1,85,467 మంది విద్యార్థులు చదువుతున్నారు. 29,707 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

**రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు: బీఆర్ఎస్**

మహారాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని భారత రాష్ట్ర సమితి ముంబై విభాగ సమన్వయకర్త శ్రీనివాస్ సులగే, కొంకణ్ విభాగ సమన్వయకర్త ప్రొఫెసర్ విజయ్ మోహితె హెచ్చరించారు. ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు పాఠశాలలను దత్తత ఇచ్చే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని.. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని మహారాష్ట్ర శిక్షణ్ బచావో కృతి సమితి ప్రకటించింది. ఇదే విషయమై రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని సమితి నిర్ణయించింది.

### బాధ్యత నుంచి తప్పించుకోలేరు

**మహారాష్ట్ర దవాఖానల్లో మరణాలపై హైకోర్టు ఆగ్రహం**

ముంబై: రోగుల రద్దీ భారం ఎక్కువైందని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకోలేరని బాంబే హైకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఇటీవల నాందేడ్, ఛత్రపతి శంభాజీనగర్ ప్రభుత్వ దవాఖానల్లో భారీగా రోగులు మృతి చెందడంపై హైకోర్టు శుక్రవారం విచారణ చేసింది. ఈ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ బీరేంద్ర సరఫ్ ప్రభుత్వ వాదనలు వినిపిస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది మీద భారం ఎక్కువైందని తెలిపారు. దీనికి కోర్టు స్పందిస్తూ.. 'భారం ఉందని చెప్పి మీరు బాధ్యత నుంచి తప్పించుకోలేరు' అని స్పష్టంచేసింది. పోస్టుల ఖాళీలను ప్రస్తావించింది.

### ద్రవ్య బిల్లుపై రాజ్యాంగ ధర్మాసనం: సుప్రీం

న్యూఢిల్లీ: ఆధార్ చట్టం వంటి చట్టాలను ద్రవ్య బిల్లు రూపంలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందుతుండటం సరైనదేనా? అనే అంశంపై దాఖలైన పిటిషన్లపై ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేయనున్నట్టు సుప్రీంకోర్టు శుక్రవారం తెలిపింది. ప్రభుత్వానికి రాజ్యసభలో తగిన సంఖ్యాబలం లేనపుడు, అక్కడ ఆమోదం పొందడానికి శ్రమపడకుండా, ద్రవ్య బిల్లు రూపంలో కొన్ని బిల్లులను ఆమోదించారని పిటిషనర్లు వాదించారు.

## ఇరాన్ హక్కుల కార్యకర్తకు శాంతి నోబెల్

### నర్గీస్ మొహమ్మదీని వరించిన పురస్కారం

- మహిళల అణచివేతపై అలుపెరుగని పోరు
- ఏండ్లపాటు జైల్లో నిర్బంధించినా వెనుకంజ వేయని ధీర వనిత



*ఓస్లో, అక్టోబర్ 6: ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం ఈ ఏడాది ఇరాన్‌కు చెందిన మానవహక్కుల కార్యకర్త నర్గీస్ మొహమ్మదీని వరించింది. ఇరాన్‌లో మహిళల అణిచివేతకు వ్యతిరేకంగా ఆమె చేస్తున్న పోరాటాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నార్వే నోబెల్ కమిటీ చైర్ పర్సన్ బెరిట్ రెయిస్-ఆండర్సన్ శుక్రవారం ఓస్లోలో ప్రకటించారు. నోబెల్ శాంతి పురస్కారాన్ని గెలుచుకున్న మహిళల్లో మొహమ్మదీ 19వ వారు. మానవహక్కుల కార్యకర్త షిరిన్ ఎబాదీ (2003) తర్వాత ఇరాన్ మహిళను నోబెల్ శాంతి పురస్కారం వరించడం ఇది రెండోసారి. ఈ పురస్కారం కింద మొహమ్మదీకి 110 లక్షల స్వీడిష్ క్రోనార్ల (దాదాపు రూ.8.32 కోట్లు) నగదు బహుమతితోపాటు 18 క్యారెట్ల బంగారు పతకాన్ని, ఓ డిప్లొమాను అందజేయనున్నారు. డిసెంబర్‌లో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది. సంప్రదాయం పేరిట మహిళలకు సవాలక్ష ఆంక్షలు విధించే ఇరాన్‌లో మొహమ్మదీ విద్యార్థి దశ నుంచే మహిళా హక్కులపై గళమెత్తారు. ఇంజినీరింగ్ పూర్తిచేశాక కొంత కాలంపాటు పలు వార్తాపత్రికలకు కాలమిస్ట్‌గా పనిచేసిన మొహమ్మదీ.. 2003లో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత షిరిన్ ఎబాదీ స్థాపించిన 'డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (డీహెచ్‌ఆర్‌సీ)లో చేరారు. ఆ తర్వాత అదే సంస్థలో ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు.*

***ఏండ్లపాటు జైలులో నిర్బంధించినా..***

*మానవహక్కుల కోసం అలుపెరగకుండా పోరాడుతున్న మొహమ్మదీకి ఎన్నోసార్లు కఠిన సవాళ్లు ఎదురైనా ఎన్నడూ వెనుకంజ వేయలేదు. ఈ క్రమంలో ఆమె 13 సార్లు అరెస్టవడంతోపాటు 31 ఏండ్లు జైలుశిక్షకు గురయ్యారు. ఇరాన్ ప్రభుత్వాన్ని విమర్శించినందుకు 1998లో తొలిసారి అరెస్టయిన మొహమ్మదీ.. ఆ తర్వాత డీహెచ్‌ఆర్‌సీలో చేరినందుకు మరోసారి అరెస్టయ్యారు. జాతి విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారన్న అభియోగంతో 2011లో ఆమెను మరోసారి అరెస్టుచేసి 11 ఏండ్ల జైలుశిక్ష విధించారు. ఆ తర్వాత బెయిల్‌పై విడుదలైన మొహమ్మదీ.. ఇరాన్‌లో విచ్చలవిడిగా అమలు చేస్తున్న మరణశిక్షలకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టారు. దీంతో 2015లో ఆమెను మరోసారి అరెస్టుచేసి, జైలుకు పంపారు.*

***ఇప్పటికీ జైలులోనే***

*ఇరాన్‌లో రాజకీయ ఖైదీలపై, ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా జైలులోనే ఉద్యమాన్ని ప్రారంభించిన మొహమ్మదీకి అక్కడ కూడా ఎంతో మంది మద్దతు తెలిపారు. దీంతో జైలు అధికారులు కఠిన ఆంక్షలు విధించినప్పటికీ ఆమె తన పోరాటాన్ని ఆపలేదు. హిజాబ్‌ను ధరించనందుకు నిరుడు ఇరాన్ పోలీసులు మాసా అమీని అనే యువతిని అరెస్టు చేయడంతో కస్టడీలో తీవ్రంగా గాయపడి ఆమె మరణించింది. దీంతో అక్కడ ఉవ్వెత్తున ఆందోళనలు జరిగాయి. వీటిని అణచివేసేందుకు పోలీసులు చేపట్టిన చర్యల్లో 500 మందికిపైగా మరణించడంతోపాటు 22 వేల మందికిపైగా అరెస్టయ్యారు. ఆ సమయంలోనూ మొహమ్మదీ తన గళాన్ని వినిపించారు. జైలులో ఎన్ని కఠిన ఆంక్షలు ఉన్నప్పటికీ అక్కడి నుంచే సంచలన కథనాలను రాసి పలు అంతర్జాతీయ పత్రికలకు పంపారు. అవి బీబీసీ, న్యూయార్క్ టైమ్స్ లాంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీటితోపాటు ఇరాన్ జైళ్లలో మహిళలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను కండ్లకు కడుతూ 'వైట్ టార్చర్: ఇన్‌సైడ్ ఇరాన్ ప్రిజన్స్ ఫర్ ఉమెన్' పేరిట పుస్తక రూపంలో బాహ్య ప్రపంచానికి తెలియజేసిన మొహమ్మదీ ఇప్పటికీ జైలులోనే ఉన్నారు.*